సాక్షి సిద్దిపేట

గురువారం । 10 । అక్టోబర్ । 2024

వర్గల్ క్షేత్రంలో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి



స్వర్ణకిరీటంతో వర్గల్ విద్యాసరస్వతీదేవి



స్వర్ణ కిరీటధారి.. విద్యాధరి

- విద్యాసరస్వతి నిజరూప దర్శనం
- నేత్రపర్వంగా 'మూల' మహోత్సవం
- భక్తులతో పోటెత్తిన వర్గల్ క్షేత్రం

వర్గల్(గజ్వేల్): శంభునికొండ అమ్మవారి నామ స్మరణతో మార్మోగింది. శ్వేతరూపిణి, జ్ఞానదీప్తి.. అమ్మ సన్నిధానం పూదోటను మరిపించింది. స్వర్ణ కిరీటం ధరించిన సరస్వతి అమ్మవారు భక్తజనావళికి నిజరూప దర్శనమిచ్చారు. బుధవారం వర్గల్ క్షేత్రంలో శరన్నవరాత్రోత్సవాల్లో కీలకమైన 'మూల' మహోత్సవం వైభవంగా జరిగింది. వేదమంత్రోచ్ఛరణల మధ్య లక్ష పుష్పార్చన నిర్వహించారు. మహాపుస్తక పూజతో అమ్మవారికి లక్షపుస్తకాలు సమర్పించారు. సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దాదాపు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



అక్షరాలు దిద్దుతున్న చిన్నారి

పీఠాధిపతుల సందర్శన

మూల మహోత్సవ వేళ పుష్పగిరి, రంగంపేట పీఠాధిపతులు శ్రీవిద్యాశంకర భారతిస్వామి, శ్రీమాధవానంద సరస్వతి స్వామి వర్గల్ క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. సరస్వతి మాత జన్మనక్షత్రం మూల మహోత్సవ వేళ క్షేత్రంలో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి కొనసాగింది. 1500 అక్షర స్వీకారాలు జరిగాయి.

'సద్దుల'కు సర్వం సిద్ధం



జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఎనిమిదవ రోజు బతుకమ్మకు వెన్నముద్దలను సమర్పించారు. గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్లలో బతుకమ్మ పూలను జోరుగా విక్రయించారు.

\- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

న్యూస్‌రీల్

పంట నష్టపరిహారం నిధులు విడుదల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం నిధులు బుధవారం విడుదల చేసింది. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు 877 మంది రైతులకు చెందిన 727.24 ఎకరాల పంట నష్టం జరిగిందని క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. దీంతో ఎకరాకు పదివేల చొప్పున రూ.72,76,000 నేరుగా రైతుల ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి రాధిక



వంటిమామిడిలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న రాధిక

ములుగు(గజ్వేల్): ఫెర్టిలైజర్ దుకాణదారులు ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక హెచ్చరించారు. మండల కేంద్రమైన ములుగు, వంటిమామిడి, కొత్తూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువులకు సంబంధించిన స్టాక్‌ను ఎప్పటికప్పుడు రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల ఏఓ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

సిద్దిపేటకమాన్: వైద్య విద్యార్థులు బైక్ ర్యాలీ చేపట్టారు. వైద్యురాలి హత్యకేసులో బెంగాల్ ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ సిద్దిపేట జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘటన జరిగి రెండు నెలలు గడిచినా న్యాయం జరగడం లేదని వాపోయారు. వైద్య విద్యార్థులకు సరైన వసతులతో పాటు రక్షణ కల్పించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టెర్రస్‌కోట మట్టి గిరక లభ్యం



మట్టి గిరకను చూపుతున్న శ్రీనివాస్

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులోని ఓ పొలంలో పురాతన కాలం నాటి టెర్రస్‌కోట మట్టి గిరక లభ్యమైనట్లు తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. మట్టిగిరకను పరిశీలించిన బృందం కన్వీనర్ హరగోపాల్ రెండు వేల సంవత్సరాల కిందట నీళ్ల తోడేందుకు వాడినట్లు తెలుస్తోందని చెప్పారన్నారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తత అవసరం: ఏసీపీ



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సతీశ్ పిలుపునిచ్చారు. పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో బుధవారం ఆయన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. నార్కొటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 15బైకులు, 5ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ఉద్యోగులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మహేశ్, అభిలాష్, విజయభాస్కర్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్ల కోలాహలం

దసరా సందడి

- మార్కెట్లన్నీ కిటకిట
- ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్ల జోరు
- ప్రత్యేక ఆఫర్లతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు

సద్దుల బతుకమ్మ, దసరా పండుగల వేళ మార్కెట్లన్నీ సందడిగా మారాయి. వస్త్రాల దుకాణాలు, షాపింగ్ మాల్స్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వారం రోజులుగా కొనుగోళ్లు పెరిగాయని, పండుగ నాటికి ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పలు దుకాణాదారులు స్పెషల్ ఆఫర్లు, స్పాట్ గిఫ్ట్‌లను సైతం అందిస్తున్నారు. అలాగే ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఈ సారి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.100కోట్ల వరకు వ్యాపారాలు జరిగే అవకాశాలున్నాయి.



సిద్దిపేటలోని సుభాష్ రోడ్‌లో కొనుగోళ్ల సందడి

సాక్షి, సిద్దిపేట: ధనిక, పేద అనే తేడాలేకుండా ప్రతి ఇంటా దసరా పండుగ సందడి నెలకొంది. తెలంగాణలోనే పెద్ద పండుగలు సద్దుల బతుకమ్మ, దసరా. ఇంట్లో అందరూ నూతన దుస్తులు కొనేందుకు పట్టణాలకు వస్తున్నారు. ఆర్థిక స్తోమతను బట్టి కొత్త దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. పల్లెల నుంచి భారీ సంఖ్యలో వస్తుండటంతో పట్టణాల్లో విపరీతమైన రద్దీ నెలకొంది. రెడీమేడ్, వస్త్ర దుకాణాలతో పాటు కిడ్స్ షాపింగ్ మాల్స్ కిటకిటలాడుతున్నాయి.

ఆన్‌లైన్ షాపింగ్..



ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మిషో ఇలా పలు రకాల ఆన్‌లైన్ వారు సైతం ఆఫర్లను ముందుగానే ప్రకటించారు. బిగ్ బిలియన్ డే పేరుతో ఒక్కొక్కటి 60 నుంచి 70శాతం వరకు డిస్కౌంట్లను సైతం ఇచ్చారు. ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్ ఏ గల్లీలో చూసినా కనిపిస్తున్నారు. కొన్ని సంస్థలు అయితే ఎక్కువ ఆర్డర్లు రావడంతో ట్రాలీ ఆటోలలో తీసుకువచ్చి డెలివరీ చేస్తున్నారు.

పూలకు డిమాండ్



బతుకమ్మ అంటేనే పూల పండుగ. బంతులు, చామంతులు, సీతజడ, గునుగు పూలను గ్రామాల నుంచి తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. బతుకమ్మలో తీరొక్క పువ్వుతో అలకరించేందుకు కొనుగోలు చేస్తున్నారు. బంతి కిలో రూ.100లకు విక్రయిస్తున్నారు. పట్టణాల్లో అలాగే జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట కుప్పలుగా పోసుకుని అమ్ముతున్నారు.

స్పాట్ గిఫ్ట్‌లు



వస్త్రాల దుకాణాలలో రూ.500 పైగా కొనుగోలు చేసిన వారికి స్పాట్ గిఫ్ట్‌లను అందిస్తున్నారు. లక్కీ డ్రాలతో సైతం ఆకట్టుకుంటున్నారు. అలాగే ఆఫర్లు పెడుతూ ఆకర్షిస్తున్నారు. దీంతో కొనుగోలు దారులతో దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. రాత్రి 11 గంటలు దాటినా రద్దీ కొనసాగుతూనే ఉంది.

రోజుకు రూ. 2 లక్షల వ్యాపారం



పండుగ సీజన్ బాగుంది. ప్రస్తుత సీజన్‌లో ప్రతిరోజు రూ.2లక్షల మేర వ్యాపారం జరుగుతోంది. ఇటీవల ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువగా జరుగుతున్నా దుకాణాలలోనూ వ్యాపారం జోరుగా సాగుతోంది. గతంతో చూస్తే ఈ ఏడాది వ్యాపారం బాగుంది. సంతోషంగా ఉంది.

\- కూర శ్రీనాథ్, స్వర్ణ సిల్క్, సిద్దిపేట

కొత్త దుస్తులు కొంటాం



బతుకమ్మ, దసరా పండుగ వేళ కొత్త దుస్తులు తప్పనిసరిగా కొంటాం. అందరం కలిసి పండుగను సంబరంగా జరుపుకొంటాం. కొత్త బట్టలు కొనుగోలు చేయడం సంతోషంగా ఉంది. వారం రోజులపాటు స్నేహితులతో సంతోషంగా గడుపుతాం.

\- భాస్కర్, సిద్దిపేట

నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలి

- కలెక్టర్ మనుచౌదరి
- జిల్లా జైలు నిర్మాణ పనుల పరిశీలన



జిల్లా జైలు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటఅర్బన్: జైలు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లను, అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. బుధవారం జిల్లా జైలు, ఎల్లుపల్లి శివారులోని మహిళా సమాఖ్య, వృద్ధాశ్రమం భవన సముదాయాలను పరిశీలించారు. జైలు ప్రాంగణంలో స్టాఫ్ క్వార్టర్స్, హాస్పిటల్ ఇతర సౌకర్యాలను కలిగి ఉండేలా నిర్మాణం చేపట్టాలని జైలు సూపరింటెండెంట్ దశరథంనకు సూచించారు. మహిళా సమాఖ్య భవనంలో నైపుణ్య శిక్షణ ఇచ్చే విధంగా, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు కంప్యూటర్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్, మగ్గంవర్క్స్ తదితర పనులలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. వృద్ధుల కోసం నిర్మించిన వృద్ధాశ్రమాన్ని వెంటనే వాడుకలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ సలీం ఉన్నారు.

నైపుణ్యంతో ఉన్నతమైన ఉద్యోగం సాధించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు, యువత తమకున్న నైపుణ్యంతో ఉన్నతమైన ఉద్యోగం సాధించాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలో యువతకు, విద్యార్థులకు నేర్పిస్తున్న శిక్షణలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉంటుందని, శ్రద్ధ పెట్టి చక్కగా నేర్చుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నగరంలో హౌస్ అరెస్టు



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దుబ్బాక: రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి నియోజకవర్గం పర్యటనకు బయలుదేరుతున్న ఎమ్మెల్యేను పోలీసులు అడ్డుకొని హౌస్ అరెస్టు చేశారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారని ఎమ్మెల్యే పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేస్తున్నామని తెలిపారు. కనీసం మాదాపూర్‌లోని తన ఆఫీస్‌కు వెళ్లనివ్వాలని కోరగా అక్కడకు తీసుకెళ్లి ఉంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందన్నారు. కేసీఆర్ హయాంలో ధర్నా చౌక్ ఎత్తివేస్తే విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు నేడు నిర్బంధాలపై సమాధానం చెప్పాలన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన పోరాడుతామన్నారు.

హక్కులపై చైతన్యమే లక్ష్యం కావాలి

- ప్రముఖ గాయకురాలు విమలక్క
- అక్కారంలో 'బహుజన బతుకమ్మ' సందడి



బతుకమ్మతో విమలక్క

గజ్వేల్: హక్కులపై మహిళలను చైతన్యపర్చడమే లక్ష్యంగా బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయకురాలు విమలక్క అన్నారు. బుధవారం సాయంత్రం గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ కార్యక్రమానికి విమలక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలందరితో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ మహిళలు గౌరవంగా జీవించే సమాజ స్థాపన కోసం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఆడపిల్లలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించే అవకాశాలను కల్పించాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ సందర్భంలో అంటరానితనం, కులమత భేదాలు లేకుండా సమానత్వంతో బతుకమ్మ పండుగ జరుపుకోవాలన్నారు. ప్రకృతి విధ్వంసానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఒకవైపు వేలాది సంవత్సరాల చరిత్ర కలిగిన అడవులను విధ్వంసానికి గురిచేస్తూ మరోవైపు మొక్కలు నాటాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. రాంచంద్రం, గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్, యువజన సంఘాల నాయకులు, కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటపాటలతో గ్రామంలో సందడి నెలకొంది.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



గజ్వేల్‌రూరల్: చెక్కులు పంపిణీ చేస్తున్న అధికారులు

గజ్వేల్‌రూరల్/ వర్గల్(గజ్వేల్): మున్సిపాలిటీతో పాటు ఆయా గ్రామాలకు చెందిన 350 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. స్థానిక ఐఓసీలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 371 మంది లబ్ధిదారులుండగా మొదటి రోజు 350 మందికి చెక్కుల పంపిణీ జరిగిందని చెప్పారు. మిగతా చెక్కులను త్వరలోనే అందజేస్తామని తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని ఆర్డీఓ బన్సీలాల్ పర్యవేక్షించగా, సీఐ సైదా బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా వర్గల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద 120 మంది లబ్ధిదారులకు రూ.1,20,13,920 విలువైన చెక్కులను పంపిణీ చేశామని తహసీల్దార్ బాల్‌రాజు తెలిపారు. అందులో 111 కల్యాణలక్ష్మి చెక్కులు కాగా 9 షాదీముబారక్ చెక్కులు ఉన్నాయని చెప్పారు.

కొలువుల సంబురం..



నియామక పత్రాలను తీసుకునేందుకు నగరానికి వెళ్తున్న నూతన ఉపాధ్యాయులతో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన కల నెరవేరడంతో నూతన ఉపాధ్యాయుల్లో సంతోషాలు వెల్లివిరిశాయి. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో 270 మంది అర్హత సాధించారు. వీరంతో ఉద్యోగ నియామక పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తీసుకునేందుకు బుధవారం సిద్దిపేట నుంచి నగరానికి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 76, లాంగ్వేజ్ పండిట్ పోస్టులు 23, పీఈటీ 8 పోస్టులు, ఎస్జీటీ 163 పోస్టులు భర్తీ అయ్యాయి. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 311 పోస్టులు ఖాళీగా ఉండగా 270 పోస్టులు భర్తీ అయ్యాయి. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ 8 పోస్టులు, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 27 పోస్టులకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కాకపోవడంతో ఇంకా భర్తీ కాలేదు.

శ్రమకు ఫలితం..

ఎంతో కష్టపడి, తీవ్ర పోటీ ఎదుర్కొని సాధించిన ఉద్యోగం కావడంతో నూతన ఉపాధ్యాయుల్లో సంతోషం తొణికిసలాడింది. పడిన కఠోర శ్రమకు తగిన ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఇటు పండుగలు.. నూతన కొలువులు

బతుకమ్మ, దసరా ఉత్సవాలు కొనసాగుతుండగా.. మరోవైపు నూతన కొలువుల జాతర నెలకొంది. నూతన ఉపాధ్యాయులుగా నియామకమైన అభ్యర్థులకు రెండు పండుగలు ఒకేసారి వచ్చాయా!... అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ దసరా పండుగ తమ జీవితంలోనే ప్రత్యేకమని అన్నారు.

చంద్లాపూర్ యువకుడికి ట్రిపుల్ ధమాకా



మహిపాల్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌కు చెందిన బంటు మహిపాల్‌కు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. మహిపాల్ చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. నలుగురు ఆక్కా చెల్లెళ్లు, ఒక అన్న ఉన్నాడు. తండ్రి మరణం తురవాత వారి కుటుంబ పరిస్థితి దీనంగా మారింది. తల్లి కూలీ పనులు చేసుకుంటూ వారిని చదివించింది. మహిపాల్ సైతం చదువుకుంటూనే సెలవు రోజుల్లో కూలీ పనులకు వెళ్లేవాడు. 10వ తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో చదివాడు. బీఈడీ, హింది పండిత్ చేశాడు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. టీజీటీ విభాగంలో టీజీడబ్ల్యూఆర్ఎస్ ఉద్యోగానికి, మరోవైపు లాంగ్వేజ్ పండిట్ విభాగంలో, అలాగే స్కూల్ అసిస్టెంట్‌లో హిందీ టీచర్‌గా ఎంపికయ్యాడు. కాగా స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తానని మహిపాల్ వెల్లడించాడు.

కష్టపడి సాధించా..



డీఎస్సీ- 2017లో నేను ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాను. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో కష్టపడి చదివాను. ఇపుడు ఎస్జీటీలో 93 ర్యాంక్ సాధించి ఉద్యోగం సాధించాను.

\-నవీన్‌కుమార్, ఇమాంబాద్

చాలా సంతోషంగా ఉంది



ఉద్యోగం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఎస్జీటీలో ఓపెన్ విభాగంలో 48 ర్యాంక్ సాధించాను. నా శ్రమతో పాటు మా కుటుంబ సభ్యులు, గురువుల పాత్ర కీలకం. కష్టపడితే ఏదైనా సాధ్యమే.

\-లావణ్య, గజ్వేల్

క్లుప్తంగా

ఆస్పత్రిలో శిశువు అపహరణ

- సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఘటన
- సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు
- ఎనిమిది బృందాలతో గాలింపు



ప్రభుత్వాసుపత్రిలో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న సీఐ భాస్కర్, సూపరింటెండెంట్ అనిల్

సంగారెడ్డి: జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో శిశువు అపహరణ కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. మనూరు మండలం దుండిగుడ గ్రామానికి చెందిన నసీమా డెలవరీ సోమవారం ఆస్పత్రికి వచ్చారు. మంగళవారం సాయంత్రం ఆడ శిశువు పుట్టింది. బుధవారం ఉదయం వారి బంధువులు పాపను వార్డు నుంచి బయటకు తీసుకొచ్చి వరండాలో పడుకోబెట్టి మాటల్లో పడిపోయారు. కొద్దిసేపటికి తిరిగి చూడగా పాప కనిపించలేదు. వెంటనే భయాందోళనకు గురైన వారు విషయాన్ని పాప కుటుంబ సభ్యులకు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనీల్ కుమార్ సంగారెడ్డి టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. టౌన్ సీఐ భాస్కర్ అనిల్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది సీసీ ఫుటేజీలను పరిశీలించారు. పాపని ఇద్దరు యువతులు ఎత్తుకెళ్లి పటాన్ చెరు వైపు వెళ్లినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఎనిమిది బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామని సీఐ భాస్కర్ తెలిపారు.

సైబర్ మోసం

రూ.2.50 లక్షలు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులు

టేక్మాల్(మెదక్): సైబర్ నేరగాళ్ల వలలో పడి వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు రూ.2.50లక్షలు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన టేక్మాల్ మండలంలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలం పరిధిలోని బర్దిపూర్‌కు చెందిన బంటు చంద్రయ్యకు రివార్డు పాయింట్లు ఉన్నాయి. వాటిని క్యాష్‌గా మార్చుకోవచ్చని ఓ సైబర్ నేరగాడు బ్యాంకు అధికారిగా నమ్మబలికాడు. వారి సూచన మేరకు చంద్రయ్య లింక్‌ను ఓపెన్ చేసి ఓటీపీ నమోదు చేశాడు. దీంతో తన ఖాతాలో ఉన్న రూ.4.69 లక్షల నుంచి ఒకేసారి రూ.2,25,199 కట్ అయ్యాయి. కంగుతిన్న అతను వెంటనే రూ.90వేలు మరో వ్యక్తికి బదిలీ చేశాడు. అనంతరం సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అయితే.. డ్రా అయిన డబ్బుల్లో రూ.50వేలు హోల్డ్‌లో ఉండటంతో ఊపిరి పీల్చుకున్నాడు. అలాగే.. టేక్మాల్‌కు చెందిన మెరుగు బాలకృష్ణ ఇదే విధంగా లింక్ ఓపెన్ చేసి ఏటీఎం కార్డు వివరాలను నమోదు చేశాడు. దీంతో రూ.9,900 సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లాయి. పల్వంచ గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూడా ఇదే తరహాలో రూ.15,300 పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ రాజేష్ వివరణ కోరగా.. బంటు చంద్రయ్యకు ఖాతాకు సంబంధించిన రూ.50వేలు హోల్డ్‌లో ఉండడంతో కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం



కొండల్ రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం మండలంలోని బద్దిపడగలో చోటు చేసుకుంది. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసిఫ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వేముల కొండల్‌రెడ్డి కొద్ది రోజులుగా ఫిట్స్ సమస్యతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయాడు. రెండు రోజుల కిందట వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు.కుమారుడు వేముల లోకేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

తంగేడు పువ్వప్పునే గౌరమ్మ

- నేడు సద్దుల బతుకమ్మ పండుగ
- ఆట పాటలతో హోరెత్తుతున్న పల్లెలు..
- నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తి



దుబ్బాకలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దుబ్బాక: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంతి పూల తోట ఉయ్యాలో.. ఇద్దరక్కజెల్లెల్లు ఉయ్యాలో.. ప్రస్తుతం తెలంగాణలో ఎక్కడ చూసినా బతుకమ్మ ఆటపాటలే కనిపిస్తున్నాయి. తెలంగాణలో బతుకమ్మ పండుగ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రకృతి సహజసిద్ధంగా లభించే గడ్డిపూలను దైవంగా కొలిచే సంస్కృతి ప్రపంచంలో తెలంగాణలో తప్ప మరెక్కడా కనిపించదు. పెత్తర అమావాస్య నుంచి తొమ్మిది రోజులపాటు జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణలో అతి పెద్ద పండుగ. ఒక్కొక్క రోజు ఒక్కో రూపంలో ఎంగిలి పూల బతుకమ్మ, అటుకుల, ముద్దప్పు, నానబియ్యం, అట్ల, అలిగిన బతుకమ్మ , వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, చివరగా సద్దుల బతుకమ్మతో పండుగా ముగుస్తుంది.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకత..

బతుకమ్మ పండుగ చివరగా తొమ్మిదో రోజున సద్దులు (పెద్ద బతుకమ్మ)కు ఈ పండుగలో ప్రత్యేకత. మహిళలంతా నేడు ఘనంగా జరుపుకోనున్నారు. గునుగు పూలు, తంగేడు, బంతి, చిట్టి చామంతి, గడ్డిపూలతోపాటు వివిధ రకాల పూలతో అందంగా పోటాపోటీగా పెద్ద బతుకమ్మను పేర్చి, తోడుగా చిన్న బతుకమ్మ, పక్కనే గౌరమ్మను తయారు చేసి పూజిస్తారు. సద్దుల బతుకమ్మ పండుగకు ఎంత దూరంలో ఉన్న వారైనా తప్పకుండా సొంత గ్రామాలకు వచ్చి పండుగలో పాలుపంచుకుంటారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఖండాంతరాలు దాటి

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ నేడు దేశ ఎల్లలు, ఖండాంతరాలు దాటి జరుపుకుంటున్నారు. విదేశాల్లో ఏళ్ల నుంచి స్థిరపడ్డ ప్రజలు బతుకమ్మ పండుగలను ఆయా దేశాల్లో ఘనంగా జరుపుకుంటారు. అమెరికా, ఇంగ్లాండ్, గల్ఫ్ దేశాల్లో, సింగపూర్‌తోపాటు చాలా దేశాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకుంటుండటం విశేషం.

79 ఏళ్లయినా ఆడుతున్నా..



బతుకమ్మ చాలా గొప్ప పండుగ. ఆడపడుచుల ఆరాధ్య దైవం. బతుకమ్మ పండుగ వచ్చిందంటే మహిళలు, పిల్లలు చాలా సంబురపడుతారు. నేను ఇప్పుడు 79 ఏళ్లకు వచ్చిన, ప్రతీయేటా తప్పకుండా బతుకమ్మను పేర్చుతా. నా పిల్లలకు బతుకమ్మ పేర్చడం, పండుగ విశేషాలు నేర్పిన. నేను మా తల్లి గారిల్లు మిరుదొడ్డిలో పుట్టి పెరిగా, 12 ఏళ్ల వయస్సు నుంచే బతుకమ్మ ఆడుతున్నా.

–బిల్ల సరోజన, దుబ్బాక

ఘనంగా జరుపుకుంటాం



సద్దుల బతుకమ్మ పండుగను ప్రతీయేటా ఘనంగా జరుపుకుంటాం. సద్దుల బతుకమ్మ పండుగకు ఆడబిడ్డలు అత్తగారింటి నుంచి తల్లి గారింటికి రావడంతో ఇండ్లన్నీ ఆడబిడ్డలు, పిల్లలతో కళకళలాడుతాయి. బతుకమ్మ పండుగ ప్రతీ సంవత్సరం చాలా సంతోషాన్ని నింపుతుంది.

–ఎర్రగుంట సుజాత, కవయిత్రీ లచ్చపేట

పెద్దగా పేర్చేటోళ్లం



మేము చిన్న తనంలో సద్దుల బతుకమ్మను చాలా పెద్దగా పేర్చేటోళ్లం. బతుకమ్మ పండుగకు ఒక రోజు ముందుగానే అడవికి పోయి మోపులకొద్ది గునుగ పువ్వు కోసుకొచ్చేటోళ్లం. ఇప్పుడు సద్దుల బతుకమ్మను చిన్నగా పేర్చుతుండ్రు.అప్పటికి ఇప్పటికీ చాలా మారిపోయింది.

–స్వాతి, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు

పురుషులు సైతం బతుకమ్మ



తోటపల్లిలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న పురుషులు

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ పల్లెలో బొడ్డెమ్మ ఆటలతో స్త్రీల బతుకమ్మ సంబురాలు మొదలై సద్దుల బతుకమ్మతో ముగిస్తాయి. ప్రకృతిని ఆరాధించే పల్లె పడుచులు గౌరీ దేవిని పూజించుటకు తొమ్మిది రోజులు తీరొక్క పూలను తెచ్చి గౌరీ దేవికి సమర్పించి కొలుస్తారు. తెలంగాణ అంతటా ఆడపడుచులు బతుకమ్మ సంబురాలను జరుపుకుంటే హుస్నాబాద్ ప్రాంతంలో మాత్రం ఆడపడుచులను సంతోష పెట్టేందుకు పురుషులు కూడా మహిళలతో కలిసి ఆడటం ఆనవాయితీ వస్తుంది. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో తోటపల్లి, గాంధీనగర్, గొల్లపల్లి గ్రామస్తులు బతుకమ్మ ఉత్సవాలను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. పెద్ద బతుకమ్మ రోజున ఇంటిల్లిపాదికి కొత్త బట్టలు తీసుకొని ధరిస్తారు. పెద్ద బతుకమ్మను ఇంటి పెద్ద పేర్చిన సోదరులు చెరువు గట్టు వరకు తీసుకెళ్లి ఒక చోట పెట్టి ఆడపడుచులను ఆటల కోసం సిద్ధం చేస్తారు. ఇట్లా కొద్ది సేపు మహిళలు ఉయ్యాల ఆటలు ఆడిన తర్వాత అక్కడే ఉన్న పురుషులు కూడా వారితో చప్పట్లు కలిపి బతుకమ్మ ఆటలు ఆడి తోబుట్టువులను సంతోష పరుస్తారు. మహిళలు పాడిన పాటలకు అడుగులు వేస్తూ చప్పట్లు కొడుతూ బతుకమ్మ సంబరాల్లో పాలు పంచుకొని సంబురాలను ముగించి గౌరీ దేవిని గంగకు చేర్చుతారు.

మా పెద్దల నుంచి ఆనవాయితీ..



మా పెద్దల నుంచి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడటం ఆనవాయితీగా వస్తుంది. మేం చిన్నప్పుడు మా ముందు తరం వారు ఆడేవారు. ఇప్పుడు దానిని మేం ఆచరిస్తున్నాం. మహిళల బతుకమ్మ పండుగ కావడంతో ఇంటికొచ్చిన ఆడపడుచులను సంతోష పెట్టేందుకు వారితో కలిసి ఆడుతున్నాం.. మహిళల మాదిరిగానే మేం బతుకమ్మ ఆటలు ఆడి, పాటలు పడుతాం.

– పోలవేని సంపత్, తోటపల్లి



బతుకమ్మలతో వస్తున్న పురుషులు

కాగితాలతో తయారీ

సైజ్‌ను బట్టి రూ.200 నుంచి రూ.1,500 వరకు విక్రయం ● శ్రమ, సమయం ఆదా



బతుకమ్మలు తయారు చేసి విక్రయిస్తున్న దుర్గయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): తెలంగాణలో బతుకమ్మ పండుగ ఎంతో ప్రఖ్యాతి గాంచింది. మహిళలు పూలను పూజించే పెద్ద పండుగ. కాగితాలతో తయారు చేసే బతుకమ్మలతో పలువురికి ఉపాధి లభిస్తుంది. మరోవైపు గునుగు పువ్వు లభించకపోవడంతో సైతం జనం కాగితాల బతుకమ్మ వైపు చూస్తున్నారు. రంగురంగుల పూలతో మహిళలు బతుకమ్మను పేరుస్తారు. కాగా ఇందులో గునుగుపువ్వుది ప్రధాన పాత్ర. ప్రస్తుతం గునుగు పువ్వు, తంగేడు పువ్వు లభించకపోవడం, బంతి, ఇతర పువ్వులకు అధిక ధరలు ఉన్నాయి. దీనికితోడు పెద్ద బతుకమ్మను పువ్వుల పేర్చడం శ్రమతో కూడుకున్న పని. దీనికి ప్రత్యామ్నాయం కాగితాల బతుకమ్మ. ఇటు పూల సమస్యకు, అటు శ్రమ సమయం ఆదా చేసుకునే వీలు ఉండటంతో జనం కాగితాల బతుకమ్మ కొనుగోలు చేస్తున్నారు.

కూలి గిట్టుబాటు

మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామానికి చెందిన మ్యాదరి దుర్గయ్య, కిష్టయ్య, ఎరుకల దుర్గేశ్ కుటుంబాలకు చెందిన వ్యక్తులు కాగితాల బతుకమ్మలను కొన్నేళ్లుగా తయారు చేస్తున్నారు. పండుగ సీజన్‌లో సుమారు నెలరోజులపాటు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈత కమ్మలతో బతుకమ్మ బుట్టని అల్లి వివిధ రంగుల కాగితాలతో అందమైన ఆకారంలో కత్తిరించి అతికించి బతుకమ్మలను తయారు చేస్తున్నారు. ఒక్కో కాగితాల బతుకమ్మకు సైజును బట్టి రూ.200 నుంచి రూ.1,500 వరకు అమ్ముతున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులకు అందరూ పనిచేస్తే ఖర్చులు పోను కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు.

కోర్టు తీర్పు అమలు చేయాలి

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయకుండా దిక్కరించారని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం చేస్తున్న ఆలస్యంపై నిరసన వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు మాదిగ ఉపకులాలతో కలిసి నల్లజెండాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ సీనియర్ నేత లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పరశురాములు, సీనియర్ నేత యాదగిరిలు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వచ్చిన వెంటనే మొదటగా శాసనసభలో స్వాగతించి, దేశంలో మొదటగా తామే అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి అలసత్వం ప్రదర్శించడం దారుణమన్నారు. డీఎస్సీ ఉద్యోగాల్లో విద్యారంగంలో నోటిఫికేషన్లను భర్తీ చేస్తూ మాదిగల నోటికాడి కూడును మాలలకు దోచిపెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణ తీసుకొచ్చి రాష్ట్రంలో అమలు చేయకపోతే సీఎం సీటును కదిలించే సత్తా మందకృష్ణ మాదిగకు ఉందన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ ప్రకాశ్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సుంచు రమేశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బీంగి పవన్ కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఈత నేర్పేందుకు వెళ్లి తానే మునిగి..

చెరువులో పడి వ్యక్తి మృతి



ఎల్లయ్య మృతదేహం

చిన్నకోడూరు(సిద్దిపేట): చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఓబులాపూర్‌లో బుధవారం చోటు చేసుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జక్కుల ఎల్లయ్య(38) తన తమ్ముడి కుమారుడైన భానుకు ఈత నేర్పేందుకు గ్రామ శివారులోని కొత్త చెరువుకు వెళ్లాడు. ముందుగా చెరువులోకి దిగిన ఎల్లయ్య ప్రమాదవశాత్తు నీట మునిగాడు. ఇది గమనించిన భాను గ్రామస్తులకు తెలిపాడు. అక్కడికి చేరుకున్న వారు ఎల్లయ్యను మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కుసంగిలో మరొకరు



యాదయ్య(ఫైల్)

టేక్మాల్(మెదక్): చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్ కథనం మేరకు.. కుసంగి గ్రామానికి చెందిన ముస్లాపురం యాదయ్య(50) వ్యవసాయంతోపాటు మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా 7న మేకలు మేపేందుకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం పెద్ద చెరువుకట్టపై వెతుకుతుండగా యాదయ్య దుస్తులు కట్టపై ఉండటంతో చెరువులో గమనించగా శవమై తేలి ఉన్నాడు. చెరువు కట్టపై బట్టలు పెట్టి స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తమ్ముడు ముస్లాపురం రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఎమ్మెల్యే అభినందనలు

ఎల్బీ స్టేడియానికి బస్సు ప్రారంభం



అభ్యర్థులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభినందనలు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ విభాగాల్లో 30 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్న నేపథ్యంలో అభ్యర్థులు వెళ్తున్న బస్సును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓలు పీపీ రాథోడ్, రాజేశ్వర్ రావు నాయక్, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా..

- అన్ని రుగ్మతల మీద పోరాటం
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

సిద్దిపేటజోన్: జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ అడుగు వేస్తుందని, సామాజిక రుగ్మతల మీద పోరాటం చేస్తున్న స్వేరోస్ ఓ ఉద్యమం లాంటిదని సంస్థ వ్యవస్థాపక చైర్మన్, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో స్వేరోస్ నేషనల్ కన్వెన్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెజ్జంకిలో 27న స్వేరోస్ జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరుకానున్నారని, సదస్సులో స్వయం ఉపాధి అవకాశాలను గురించి చర్చ చేసి భవిష్యత్ ప్రణాళిక రూపకల్పన చేయనున్నట్లు పేర్కొన్నారు. శంకరన్ ఆశయ సాధనకు స్వేరోస్ గురుకుల చైతన్యం తెచ్చినట్లు పేర్కొన్నారు. సంస్థ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేక సామాజిక అంశాలపై పోరాటం చేసి విజయాలు సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి సదస్సుకు స్వేరోస్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కన్వీనర్ దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్,ప్రతినిధులు వీరన్న, సురేశ్, శంకర్, బాబు, జనార్దన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

మంటల్లో కాలి బూడిద



కాలి బూడిదైన బైక్, (ఇన్‌సెట్‌లో..) గాయపడ్డ నిఖిల్

కొల్చారం(నర్సాపురం): బైక్‌ను కారు ఢీకొట్టడంతో కాలి బూడిదైన ఘటన మండలంలోని రాంపూర్ గ్రామ శివారు మెదక్ నర్సాపూర్ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. కొల్చారం పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన నిఖిల్ మెదక్‌లోని డీపీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. బైక్‌పై కార్యాలయానికి బయలుదేరగా రాంపూర్ వద్దకు రాగానే మెదక్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. నిఖిల్ పొలాల్లో పడిపోగా, బైక్ మరోవైపు పడిపోయి మంటల్లో కాలి బూడిదైంది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మహ్మద్ గౌస్ ఘటనా స్థలానికి చేరుకొని నిఖిల్‌ను చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీ..

బైక్‌తో ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పాపన్నపేట మండలం కొడుపాక గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో పని చేస్తున్నాడు. సాయంత్రం ఫంక్షన్ హాల్ నుంచి బస్టాండ్ వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇదే సమయంలో మండలానికి చెందిన వరిగుంతం కుడి చెరువు తండాకు చెందిన లంబాడీ శంకర్ మరో వ్యక్తి డాక్య బైక్ పై పోతంశెట్టిపల్లి వైపు వస్తూ నారాయణను బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నారాయణకు తీవ్ర గాయాలు కాగా, బైక్‌పై ఉన్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. నారాయణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఏర్పాట్లలో రాజీ పడొద్దు: ఏసీపీ మధు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ మధు, మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ఏర్పాట్లలో రాజీ పడొద్దని ఏసీపీ మధు ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌తో కలిసి బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. దసరా పండుగ సందర్భంగా రంగదాంపల్లి, నర్సాపూర్, రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో రావణదహనం ఏర్పాట్లు, ప్రజలకు వసతులు, పార్కింగ్ ప్రక్రియ గురించి పరిశీలించి ఆరా తీశారు. దసరా పండగకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉందని, బందోబస్తు పటిష్టంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం కోమటిచెరువు, నర్సాపూర్ చెరువులను పరిశీలించారు. సద్దుల బతుకమ్మ పండుగ నేపథ్యంలో గురువారం పెద్ద ఎత్తున మహిళలు బతుకమ్మ నిమజ్జనం కోసం వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, మున్సిపల్ డీఈ, ఏఈలు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వామ్మో.. చిరుత!

కడ్పల్ శివారులో మళ్లీ ప్రత్యక్షం



కల్హేర్(నారాయణఖేడ్) : కడ్పల్ కెమెరాకు చిక్కిన చిరుత పులి సంచరిస్తున్న ఫుటేజీ

కల్హేర్(నారాయణఖేడ్): చిరుత పులి మళ్లీ ప్రత్యక్షమవంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో బాచేపల్లి, కడ్పల్, సంజీవన్‌రావుపేట, సిర్గాపూర్, అలీఖాన్‌పల్లి, రాపర్తి, ఖాజాపూర్, తదితర చోట్ల వ్యవసాయ భూముల వద్ద పశువులపై దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. ఇటీవల కడ్పల్ గ్రామ శివారులో చిరుత పులి సంచరించిన ప్రదేశం, లేగదూడను చంపిన చోట అటవీశాఖ అధికారులు కెమెరాలు ఏర్పాటు చేశారు. తిరిగి అదే చోట చిరుత సంచరిస్తున్న ఫుటేజీ లభించింది. అలాగే.. ఖానాపూర్(కె) శివారులో అడవిలో బండరాళ్లపై కూర్చున్న చిరుత పులి పశువుల కాపరుల కంటపడింది. సిర్గాపూర్ మండలం కడ్పల్ శివారులో చిరుత తిరిగిన పాదముద్రలను గ్రామానికి చెందిన రైతు భద్రరెడ్డి సెల్‌ఫోన్‌లో బంధించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖఅధికారులు చాటింపు చేయించారు.

దుబ్బాకలో చిరుతపులి కోసం గాలింపు

దుబ్బాకటౌన్: చిరుత సంచారంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ కోరారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు పులి ఆచూకీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. బుధవారం దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ వడ్డేపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వడ్డెపల్లి అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు అడవి పక్కన వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు చెప్పడంతో పులి జాడ కోసం అడవిలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అడవికి దగ్గరగా వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు గొర్రెలు, మేకలు, పశువులను పొలాల వద్ద ఉంచొద్దన్నారు. రైతులెవరూ పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. చిరుత పులి జాడ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు హైమద్ హుస్సేన్, మల్లేశం, బీట్ ఆఫీసర్లు జహంగీర్, వేణు పాల్గొన్నారు.